# విధి వెక్కిరించింది

సైరను భయంకరంగా అరిచింది. ఆ శబ్దం ఎత్తైన జైలుగోడల్నిదాటి నిద్రపోతోన్న ప్రాణుల గుండెల్లోకి వ్యాపించింది. సమయంకాని సమయంలో సైరను అలా ఊరకుక్కలా అరిస్తే అందరిగుండెలు బిక్కుబిక్కు మంటూ భయంతో నిండిపోతాయి. దాని శబ్దంలోని కాఠిన్యం రానున్న ఏదో విపత్తుకు చిహ్నం.

అరడజను సార్లు సైరను ఉండి ఉండి అరిచింది. నిద్రపోతోన్న ప్రజల్లో పెద్ద సంచలనం తుఫానులా లేచింది. ఆ తుఫానులో సన్నని రెల్లుదుబ్బుల్లాంటి పిరికి వాళ్ళు గజగజ కంపించిపోయారు. బిడాయించుకున్న తలుపుల్ని తెరుచుకొని వీధుల్లో కొచ్చి నలుగురైదుగురు కలిసి ఒక గుంపై 'ఎందుకూ?' అని ప్రశ్నించుకుంటున్నారు. కొంతమంది అసలు కారణం తెలుసుకుందామని జైలు వయిపు వెళ్ళారు.

గజదొంగ గంగులు జైలునుండి పారిపోయాడన్న వార్త అరగంటలో ఊరల్లా గుప్పుమంది. అంతా తలో విధంగా అతని గురించి చెప్పుకొంటున్నారు. అతనిపేరు ఉచ్ఛరిస్తున్న ప్రతీవారూ గుండెలో ధైర్యాన్ని గుత్తకు తెచ్చుకొని చుట్టూ కలయచూసి భయం భయంగా గుసగుసలాడుతున్నారు. కొంత మంది – తమ ప్రాణాల్ని ధనంతో తూకంవేసే అతిదాహం మనుషులు – సీలువేసిన యినప పెట్టెల్లా తలుపుల్ని తాళాలతో బిగించి ముసుగుల్ని కప్పుకున్నారు.

గంగులు పేరుచెప్తే అక్కడి వాళ్ళందరికీ హడల్. ఐదారు ప్రాణాల్ని సులభంగా, నిర్భయంగా తన చేతులతో తీసినవాడు గంగులు. లక్షాధికారి గుండెల్లో సింహస్వప్నం. ఏ క్షణంలోఅయినావచ్చి మీదపడతాడేమోనని ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకొని గజగజలాడుతూంటారు. రహస్యమయిన అతని చర్యల గురించి, విచిత్రమయిన ఎత్తుగడల గురించి అక్కడంతా ఆశ్చర్యంగా చెప్పుకుంటారు. గత కొద్దినెలల క్రిందట ఒక లక్షాధికారి యింట్లో కన్నంవేసి, అతను అల్లరిచేస్తే అతని ప్రాణాల్ని తీసి పారిపోయి అజ్ఞాతంగా గడుపుతూ పోలీసులకు చిక్కిపోయాడు. కేసు దర్యాప్తుచేసి ఉరిశిక్ష విధించారు. మరోవారంరోజుల్లో అతని ప్రాణవాయువులు గిలగిలాతన్నుకొని తన్నుకొని అనంత వాయువుల్లో కలిసిపోతాయి! ఒక భయంకరమైనచావు – నికృష్టమైన బలవంతపు గతిలేని చావు చస్తాడతను.

చావంటే అతనికి భయంలేదు. కాని ఆ చావునుండి అతడు తప్పించుకొని పారిపోవాలనుకున్నాడు. పిరికివాళ్ళు చచ్చేచావది. పిరికివాళ్ళల్లా తనుచావడం అతనికి యిష్టంలేదు. 'ధైర్యంచేసి తప్పించుకొని అక్కడనుండి పారిపోవాలి. దొరికిపోతే వాళ్ళ చేతుల్లోమాత్రం చావగూడదు' అనుకున్నాడు.

ఒకరాత్రి చీకటి రాకాసి విశాలంగా ఊరంతటినీ ఆవరించినప్పుడు, దాని నల్లని జుత్తులాంటి మేఘాలు ఒత్తుగా వ్యాపించినప్పుడు, ఆ మేఘాలు భయంకరంగా గర్జిస్తూ మహాప్రళయాన్ని సృష్టిస్తున్నప్పుడు అతను అతి తెలివిగా కాపలా వాడిని తప్పించుకొని ఎత్తయిన దాని 'కాంపౌండ్‌వాల్' దాటి దానివెనుకవైపు తుప్పల్లోంచి, పొలాల్లోంచి పారిపోయాడు!

అతను పారిపోయాక, పారిపోయినట్టు గుర్తించాక జైలువార్డర్లూ, ఆఫీసర్లూ నాలుగువైపులకూ పరుగెత్తారు. గట్లూ, తుప్పలూ వెతుక్కుంటూ జైలుచుట్టూ పొలాల్నీ గ్రామాల్నీ గాలించేస్తున్నారు. జైల్లో నాలుగువైపులా అమర్చిన 'హెడ్‌లైట్లు' అరమైలుదూరం చీకట్లను చీలుస్తూ వెలుతుర్ని సృష్టించి రూపాల్ని ప్రత్యక్షంచేస్తున్నాయి.

గంగులు రెండుమైళ్ళదూరం ఆగకుండా పరుగెత్తాడు. దారిలో చీకటిలో మూడు నాలుగుచోట్ల గోతుల్లోపడి మోకాళ్ళు కొట్టుకపోయాయి. చీకట్లో కనిపించక పెద్దపెద్ద బండరాళ్ళను తన్ని పాదాల్ని, వ్రేళ్ళను చిదగ్గొట్టుకున్నాడు. వంటినిండా ముళ్ళ కంచెలు గుచ్చుకొని గీరుకుపోయాయి. రక్తంకూడా బయటపడింది. కాని చీకట్లో బాధతప్ప యింకేమీ తెలీడంలేదు. మోటయిన మనిషి గనుక వీటన్నిటినీ లెక్కచేయకుండా ఎక్కడా

ఆగకుండా రెండుమైళ్ళు ఏకధాటిని పరుగెత్తాడు. ఇంకా పరుగెత్తేవాడే. అప్పటికి దగ్గర్లో మినుకు మినుకు మనే దీపాలతో ఏదో పల్లెటూరు కనిపించింది. ఊరును చూడగానే ఆయాసం, గాయాలబాధ అధికమయ్యాయి. ఇకముందుకు వెళ్ళడం సాధ్యం కాదనుకొన్నాడు. బాధతోనే మూలుగుతూ ఆతృతతో అంగలువేసి నడుస్తూ పొలంకంచె గట్టు తగిలి తూలిపోయి గోతిలో పడ్డాడు. గోతిఅంచు బలంగా గుండెకు మోపింది. ఒక తుమ్మముల్లు పాదంలో లోతుగా గుచ్చుకొంది. 'అమ్మా' అని మూలిగాడు. క్రూరమయిన ఆలోచనలతో గడ్డకట్టిన పాషాణంలాంటి అతని గుండె బాధతో జాలిగా అరిచింది! అయిదు నిమిషాల వరకూ అతను కదలలేకపోయాడు.

దూరంగా ఏవో అరుపులు, విజిల్లు వినిపిస్తున్నాయి. నిశీధపు ఆకాశంలో, నల్లని భూమ్మీద, చెట్ల గుబురుల్లో హెడ్‌లైట్ల వెలుతురు యింకా తిరుగుతూనే ఉంది. ఆ వెలుతుర్ని చూసి ఆకాశంలో పక్షులు, భూమ్మీద జంతువులు గోలచేసి అరుస్తున్నాయి. రానురాను మనుషుల కలకలం, విజిల్ల శబ్దం మరీ గట్టిగా యింకా దగ్గర దగ్గరగా వస్తున్నట్టు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

అయిదుసార్లు నిర్దయగా ప్రాణాల్ని తీసినప్పుడు, తెగించి సంకెళ్ళ బంధాల్ని దాటి జెయిలుగోడ దూకి పారిపోదామనుకున్నప్పుడు ఉండే ధైర్యం యిప్పుడతనిలో లేదు. ప్రాణాల్ని ఆవరించుకొని భయం రెక్కలుచాచింది. తిరిగి తిరిగి మళ్ళీ మొదటికే – ఆ కటకటాల జెయిల్లో రహస్యమైన నాలుగుగోడల చీకటిగదిలోని నికృష్టపు బతుకులోకే వెళ్తున్నాడు. జెయిలువార్డర్ల చేతుల్లో కుళ్ళుపోట్లు, డొక్కల్లో తన్నులు, చీదరించుకొని కాండ్రించి వేసిన ఉమ్ములు, ప్రజల్లో తన పలుకుబడి, గజదొంగ గంగులుగా తన రాక్షసత్వం-యివన్నీ జ్ఞాపకానికి రాగానే గజగజా వణికిపోయాడు.

గోతిలోంచి లేచి దుమ్ము దులుపుకొని కాళ్ళీడ్చుకుంటూ అక్కడనుండి బయలుదేరాడు. గుండె అదురు, గాయాల బాధ ఉండేకొలదీ అధికమవుతున్నాయి. కాలుతీసి కాలుపెట్టడంకూడా సాధ్యంకావడంలేదు. అయినా ఎల్లాగో కాళ్ళీడుస్తున్నాడు. 'ఏదో రక్షణస్థలాన్ని ముందు వెతుక్కొని దాగోకపోతే తను వాళ్ళ కళ్ళల్లో పడిపోవచ్చు.'

ఈసారి విజిల్లశబ్దం మరీ దగ్గరగా వినిపించింది. 'ఈ పాటికి వాళ్ళు పొలిమేర దాటి గ్రామంలో ప్రవేశించే ఉంటారు. 'మరో రెండునిమిషాల్లో...'

విపరీతమయిన భయంతో కాళ్ళు కదలడంలేదు.

దగ్గరగా ఏదో దొడ్డివయిపు యింటిగుమ్మం కనిపించింది. ఆ తాటాకుపాక

పగిలిపోయిన దొడ్డిగుమ్మం రెక్కలకన్నాల్లోంచి కిరసనాయిలు దీపపు వెలుతురు చారలు నేలమీద వాలుతున్నాయి. పాకవెనుక దొడ్లో దాన్ని కప్పివేస్తూ గుబురుగా ఏవో రెండుచెట్లు పెరిగి ఉన్నాయి. చెట్లను, పాకను చుట్టి ఒకపాదు దట్టంగా అల్లుకొనివుంది.

మెల్లగా వెళ్ళి చెట్ల వెనక పాదువారనే కూర్చున్నాడు. ఊపిరిబిగబెట్టినట్టు శబ్దంలేని ఉచ్ఛ్వాసనిశ్వాసాల్ని తీస్తున్నాడు. కొంతమంది జెయిలు వార్డర్లు రావడం, వీధుల్లో నాలుగుచోట్లా వెతికి నిద్రపోతున్న వాళ్ళనులేపి వాకబుచేసి వెళ్ళిపోవడం-అంతా చాటుగా కూర్చొని చూశాడు. వాళ్ళు వెళ్ళిపోగానే 'హమ్మయ్యా' అనుకున్నాడు.

దొడ్డితలుపు తోసుకొని ఒక ముసలమ్మ బయటకి వచ్చింది. ఆ చీకట్లో తడుముకొని ఏదో వస్తువుని తీసుకుని వెళ్ళిపోయి తిరిగి తలుపు దగ్గరగా చేరవేసుకొంది. గంగులు అక్కడకు వచ్చి కూర్చున్నప్పటినుండి ఏదో సన్నగా మూలుగు ఆ యింట్లో నుండి వినిపిస్తూనే ఉంది. ఎవరో స్త్రీ నీరసంగా మూలుగుతోంది. నిశ్శబ్దపు లోకంలో బాధల అగాధంలో ఏ జీవో ఏడుస్తున్నట్టుగా ఉంది!

తలుపు దగ్గరగా వెళ్ళి రెక్కల సందుల్లోంచి తొంగి చూశాడు గంగులు. కొండెక్కుతూన్న కిరసనాయిలు దీపం మసకవెలుతుర్లో ఒక స్త్రీ ప్రసవవేదన పడుతోంది. నులకమంచంలో బాధతో మెల్లగా మూలుగుతోంది. కాలంతీరి పండిపోయిన ముసలమ్మ ఒకర్తి ఆమెకు సేవలు చేస్తోంది. ఆ ముసలమ్మ తప్పించి ఆమె దైన్యాన్నీ, బాధనూ అర్థంచేసుకున్నవాళ్ళు అక్కడలేరు.

ఆ వూర్లో ఆమెకు నా అన్నవాళ్ళు లేరు. ఉన్నవాళ్ళందరూ ఆమెను దూరంగా తరిమివేసి బాంధవ్యాన్ని తెగతెంపులు చేసుకున్నారు. ఆ వూరికి ఆమె ఒక చీడపురుగన్నారు. కాని అలా బాహాటంగా అన్నవాళ్ళు రహస్యంగా ఆమె 'ఆనందాల పుట్ట' అని ఒప్పుకున్నారు. ఆమె పాడయిపోయిన ఆడది! సంఘం నుండి దూరంగా తరిమివేయబడ్డ స్త్రీ. అందువల్ల ఆమెకు సాయం చేయడానికి ఎవరూ పూనుకోడంలేదు.

కాని జీవితంలో అనేక దెబ్బల్ని చవిచూసి రకరకాల మనుషులమధ్య గడిపి, సుఖదుఃఖాల్ని అవగాహన చేసుకున్న ముసలమ్మ ఎవర్నీ లెక్కచేయకుండా అందర్నీ తోసిపారేసి ఆమెను కష్టాల్లో ఆదుకొంది. ఆ ముసలమ్మకు ఆమె అంటే అభిమానం. కారణం – తననుకూడా అలాగే దూరంగా తరిమి ఏకాకినిచేశారు గనుక. ఆ రాత్రి ఆమె నొప్పులతో మూలుగుతుంటే ఆమెను తల్లిని చేయడానికి పూనుకొని కళ్ళల్లో వత్తులెట్టుకుని, కన్నకూతురిలా సాకుతోంది.

మళ్ళీ తలుపులు తెరుచుకున్నాయి. గంగులు అక్కడనుండి గబగబా వెళ్ళిపోబోయాడు. ఆమె అలికిడిని పసిగట్టి "ఎవరూ?" అంది. గంగులు ఆగిపోయాడు. ఏమీతోచక "నేనూ" అన్నాడు. ఆమె లైటుతెచ్చి "ఎవరయ్యా?" అంది, అతనిముఖంలో వెలుతురు పడేలా దగ్గరగా లైటుఎత్తి.

"పొరుగూరివాడ్ని నేను. అవతలియింటి అరుగుమీద పడుకుంటే ఏదో మూలుగు వినిపించి ఏమిటా అని లేచి యిల్లా వచ్చాను.... ఏమిటి?.....ఎవరు?" అన్నాడు.

"అబ్బే- నొప్పులు పడుతోంది నాయనా. నువ్వెవరవో తెలీదుకాని దేవుడిలా సమయానికి వచ్చావు. చూడునాయనా, కాస్త ఒకపని చేసిపెడతావా? మంత్రసాని నరసమ్మను పిలవాలి బాబూ." అంది.

ఆమె ముడతల ముఖంలో ఆవేదన, భయాల రేఖల చారలు స్పష్టంగా అతను చూడగలిగాడు. ఆమె మీద జాలివేసింది. కాని పాదాలనిండా ముళ్ళు, శరీరంనిండా గీరుకు పోయి రక్తం కారుతూన్న చారలు, అడుగుకదిపి అడుగువేయలేని అసహాయత- వీటన్నింటితో ఎలా వెళ్ళడం? పాపం ఆమె విపరీతమయిన బాధపడుతోంది. ఆమె ప్రాణానికి కూడా ముప్పు వచ్చేటట్టు ఉంది. ఎలాగో ఓపికచేసుకొని వెళ్తే రెండు ప్రాణాల్ని రక్షించినవాడు కాగలడు తను. బయటికి వెళ్ళితే పట్టుబడిపోతాననే భయంకూడా పోయింది. వాళ్ళు ఎప్పుడో వెళ్ళిపోయారు. అప్రయత్నంగానే "ఊ" అన్నాడు. ఆమె మంత్రసాని యింటి గుర్తులు చెప్పింది.

గంగులు ఆశ్చర్యపోయాడు. 'పోలీసు ఆఫీసర్లకుకూడా లొంగిపోని తను ఒక ముసలమ్మకు లొంగిపోయి ఆమె చెయ్యమన్న పని చెయ్యడానికి ఎలా ఒప్పుకున్నాడు?'

అలా వెళ్ళి పదినిమిషాల్లో మంత్రసానిని పిలుచుకుని వచ్చాడు. "అవసరమయితే మళ్ళీ పిలు మామ్మా, అవతల యింటి అరుగుమీద ఉంటాను." అన్నాడు. "అలాగే" అని ఆమె వెళ్ళిపోయింది.

గంగులు అవతలియింటి అరుగుమీద కూర్చున్నాడు. అతనికి పూర్తిగా తన గాయాలమీద ధ్యాసపోయింది. అవతల నుండి ఆమె ఉండి ఉండి అరుస్తున్న అరుపులు, బాధగా మూలుగుతున్న మూలుగులు ఆ పాషాణ హృదయాన్ని ఛిన్నాభిన్నం చేసివేస్తున్నాయి. ఆ చుట్టూ ఉన్న వాళ్ళమీద అతనికి విపరీతమయిన కోపం విచ్చింది. 'అంత భయంకరంగా చావుబ్రతుకులతో ఆమె పోట్లాడుతూంటే జాలిగా యిరుగు

పొరుగువాళ్ళు ఒక్కరూ రారేమిటి? అనుకున్నాడు. అందరినీ అసహ్యించుకొని సృష్టి ప్రసాదించబోతోన్న బిడ్డ ఏడుపు విందామని ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

అరగంట గడిచింది. నిరాశ ఎండుమోడు హృదయంలో చిన్న చిగురుటాకు ఆశ తలఎత్తినట్టు, భయంకర బాధల కారడవిలో విశాలమైన చక్కటి ఆనందపు రాచబాట అగుపించినట్టు ప్రసవవేదనలలోని తల్లి బాధల మూల్గుల్లో పసిపాప కంఠం కేర్ కేర్ మని వినిపించింది. కాని అంతలోకే తెల్లని పాలవన్నె బుల్లిచంద్రుడ్ని ప్రళయకాలపు నల్లని మేఘాల బాహువులు విశాలంగా వ్యాపించి ఆవరించినట్టు ఆ పసిపాప అరుపుల్ని ఆవరించి ఆ ముసలి అవ్వ గొంతుచించుకొని ఏడుస్తోంది!

తలవంచుకొని, విఫలమయిన తన హస్త లాఘవాన్ని నిందించుకొని మంత్రసాని బయటికి వచ్చింది. గంగులు ఆత్రుతగా ఆమె దగ్గరకు వెళ్ళి "ఏమయిందీ"? అన్నాడు.

"ఆ తల్లికి భూమ్మీద నూకలు లేవు. చేసిన పాపం పండింది." అంది నర్సమ్మ, అని చీకట్లో దారివెతుక్కొని ఆ దొడ్డి వెంటే వెళ్ళిపోయింది.

పాపం అనుకున్నాడు గంగులు. గబగబా తలుపులు తెరుచుకొని లోపలికి వెళ్ళాడు. గాలికొట్టి ఉబ్బించిన రబ్బరు బొమ్మలాంటి పిల్ల సుఖదుఃఖాలకతీతంగా ప్రాణంలేని తల్లి హృదయానికి దగ్గరగా తనమానాన తను ఆడుకొంటోంది!

చావు బ్రతుకులు యింత సన్నిహితంగా ఉంటాయనే సత్యం గంగులకు అప్పుడర్థమయింది. ప్రాణాన్ని సులభంగా తీసివేసే అతను ఆమెచావును చూసి కన్నీళ్ళు కార్చాడు! పాషాణంలాంటి అతని దయలేని హృదయం వెన్నలా కరిగిపోయింది!

"ఏం మామ్మా! యీమెకెవరూ దగ్గరివాళ్ళు లేరా?" అన్నాడు.

ఆమె జాలిగా నవ్వింది. "ఉన్నారు, ఎందుకూ? ఒక్కరూ ఆమె గోతిలో పిడికెడు మట్టయినా వెయ్యరు. వాళ్ళంతా నీతీ, నిజాయితీఉన్న మనుషులు. ఆమె నీతిలేని ఆడది. సంఘం వెలివేసిన స్త్రీ. ఇంకెందుకు బాబూ ప్రాణంలేని దేహాన్ని ఎక్కడపాతితే ఏముంది! ఆపని ఎవరుచేస్తే ఏముంది?"

"ఆమెకు నువ్వేమీ కావా?" తిరిగి అడిగాడు.

"ఏమీకాను. నీలా కష్టాల్ని చూసి సహించలేని గుండెనాది. పిల్లను పుట్టెడు కష్టాల్లోఉంచి అంతా బయటినుండి వెకిలిగా నవ్వుతూంటే చూసి ఊరుకో లేకపోయాను. కాని యింతకన్నా ఆమెకు ఎక్కువరాసిలేదు. ఆయువు తీరింది"

"మరి పసిపిల్లగతో?"

"పుట్టించినవాడు ఏ ఆధారమూ కలిగించకపోడు. లోకం గొడ్డుపోలేదు నాయనా. అక్కడక్కడ దయా దాక్షిణ్యాలు యింకా మిగిలేఉన్నాయి. ఏ పుణ్యాత్ముడో ఆపిల్లను పెంచి పెద్దచేయకపోడు".

'ఎంత భారమయిన బ్రతుకు! అనుకున్నాడు. మరో విధంగా సానుభూతి చూపించడానికి యిప్పుడతను చట్టప్రకారం శిక్షితుడు. ప్రభుత్వ నిఘాకింద ప్రాణాల్ని గుప్పెట్లో ఉంచుకొని రహస్యంగా ఉన్నవాడు. అందరి దృష్టిలోనూ హంతకుడు.

సానుభూతి చూపించే మార్గంలేక నిట్టూర్చి మెల్లగా అక్కడనుండి కదిలి ఊరువిడిచి వెళ్ళిపోయాడు. తెల్లవారేసరికి కాళ్ళీడ్చుకొని ఆ వూరుదాటి ఏడు మైళ్ళదూరం వెళ్ళి సురక్షితమైన ప్రదేశం చేరుకున్నాడు. అక్కడ తమగుంపులోని ఒకడి ఇంట్లో ఆశ్రయం లభించింది.

చీకటి తెరలు, మంచుపొగలు వెలుతురి వేడిలో కరిగి, లోపలి తమ అందమయిన ఆకారాలతో ప్రకృతి యింకా ప్రత్యక్షంకాకుండానే, మనుషులు తమ తమ బద్ధకాన్ని సగంసగం మగతను పూర్తిగా దులుపుకోకుండానే గంగులు జెయిలులో నుండి పారిపోయాడన్న వార్త చుట్టుపట్ల పదిగ్రామాల మేరకు పాకిపోయింది. ఆ వార్త నలుగురి నోళ్ళమీదుగాపోగానే ఒక కొత్త రూపాన్ని తొడుక్కొని, అక్కడనుండి పదిమందిద్వారా వెళ్ళి రెండురకాలై-ఇంకా వెళ్ళేకొలది "అర్థమెటిక్ ప్రోగ్రషన్' లా ఒకదానినొకటి గుణించుకొంటున్నాయి. చీకటిపడే సమయానికి పది రకాల కథలు అతనిమీద ప్రచారంలో ఉన్నాయి!

ఆరోజల్లా అతను ఆ యింట్లోనే గడిపాడు. అనేక ఆలోచనలతో అతని మనసు నిండిపోయింది. గతరాత్రి దృశ్యం మాటిమాటికి కళ్ళముందుకొచ్చి నిల్చుంటోంది. ఏడుస్తున్న పసిపాపముఖం, చైతన్యంలేని కళాకాంతులు పోని అస్థమించిన ఆ తల్లి ఆకారం, ఏకాకుల్లాంటి జీవితాలు, అసహ్యించుకోబడిన వాళ్ళ బ్రతుకులు -అన్నీ అతనిముందు తిరుగాడుతున్నాయి.

'ఆ అమ్మాయిని తను పెంచుకుంటే?' అనుకున్నాడు.

'కత్తిమీదసాములాంటి జీవితం తనది. అనుక్షణం గండంగడిచి కొత్త బ్రతుకు బతుకుతున్నట్టు- తిరిగి జన్మఎత్తినట్టు - అనిపించే దినదినగండం జీవితంలో ఆ పిల్లభారాన్ని ఎంతకాలం మోయగలడు తను?

'కాని .....ఆ అమ్మాయికీ, తనకూ ఏదో పూర్వజన్మ సంబంధం ఉన్నదనిపిస్తోంది.

ఆ అమ్మాయిని చూడగానే తన హృదయంలో ఎంతమార్పు వచ్చింది! తనది ఎంత పాపమైన బతుకు. తన పాపాల కుళ్ళు జీవితాన్ని ఎక్కడికక్కడ శుద్ధి చేసి కొత్తజీవితాన్ని దిద్దడానికి పుట్టినట్టనిపించిందా పిల్ల. తనకుకూడా సంతానంలేదు. అందుకే తన హృదయంలో ప్రేమలు, దయాదాక్షిణ్యాలు లేవు. ఆ పిల్లను చూడగానే ఏదో ప్రేమ తనలో తలఎత్తింది. ఆ పిల్లను తెచ్చుకొని ఎక్కడో అజ్ఞాతంగా పడిఉండి సరికొత్త జీవితం – అతిసామాన్యమైన నిరాడంబరజీవితం బ్రతుకుతూ యీ జీవిత శేషాన్ని గడిపివేయాలి.'

ఆ రాత్రి ఆకారాన్ని మార్చుకొని గంగులు బయలుదేరాడు. తిన్నగా నిన్నటి ఊరుచేరి గతరాత్రి తనకు ఆశ్రయమిచ్చి ఒకపిల్లపుట్టుకను, ఒకతల్లి చావును తనలో యిముడ్చుకున్న శిథిలమయిన ఆ పాకను చేరుకున్నాడు.

పాకలో పసిపిల్ల ఏడుస్తోంది. ఆకలిస్వర తంత్రుల్ని కదిపి మలహరి రాగాన్ని ఆలాపిస్తున్నట్టు, నిశ్శబ్దంలో అర్ధరాత్రి ఏకాంతంగా తనలోని జీవుల్ని తలంచుకొని ప్రకృతి మెల్లగా ఏడుస్తున్నట్టు, లోతయిన అగాధంలోకి జారిపోయి అరుస్తున్నప్పుడు దూరం అవుతూన్న శబ్దం క్రమక్రమంగా మాయంఅవుతూన్నట్టు ఆ పసిపిల్ల ఏడుపు ఉండేకొలది నీరసించి ఆమెలోనే అణగారిపోతోంది. ఆ ముసలమ్మ ఏమీచెయ్యలేక చేతగాని దానిలా నిరాశగా చూస్తోంది.

తలుపు తోసుకొని వెళ్ళి ఆ పిల్లను గుండెల్లోకి తీసుకున్నాడు గంగులు. ఆ ముసలమ్మ ఆశ్చర్యంగా, భయంగా అతనివైపు చూసింది.

"చూడుమామ్మా, నేను యీ పిల్లను తీసుకెళ్ళి పెంచుకుంటాను, ఇచ్చేస్తావా?" అన్నాడు.

అతనెవరో ఆమెకు అర్థంకాలేదు. అకస్మాత్తుగా ఒక వ్యక్తివచ్చి పరిచయమున్నవాడిలా ఆ విధంగా అడగడం ఆమెకు ఆశ్చర్యం అనిపించింది.

"నేనూ..... నిన్నటి పొరిగూరిమనిషిని. రాత్రి నర్సమ్మను పిలుచుకువచ్చాను కదూ, కొద్దిగా ఆకారం మార్చుకుంటే అప్పుడేమర్చిపోయావా?"

"నువ్వా నాయనా, గుర్తుపట్టలేకపోయాను. సర్లే, పిల్లను పెంచుకుంటా నంటావా? బాగానేఉంది. కాని నీ ముక్కూ మొగం ఎరగనిదాన్ని. ఎవరి తాలూకానో, ఏమిటో తెలీదు. ఎలా యిచ్చేయను? పిల్లను పెంచుకోవడం అంటే మాటలు కూడాకాదు. వెనకాల ఆడవాళ్ళు ఉండాలి, పెంచగలిగే స్తోమత ఉండాలి'

"ఆ విషయంలో నీకేం భయంలేదు. కన్న కూతురికన్నా ఎక్కువప్రేమతో పెంచుకుంటాను. ఈ పిల్ల నా జీవితాన్నే మార్చివేసేదవుతుంది. నాకూ ఎవరూ లేరు. కావలసినంత డబ్బు ఉంది. కావాలంటే బంగారంతో యీపిల్ల శరీరాన్ని కప్పేస్తాను. పిల్లను నా చేతుల్లో పెడితే నీకు ఏ చింతా అక్కరలేదు. బాగా ఆలోచించు. నువ్వా-పెంచలేవు. గౌరవంగల డబ్బున్నవాళ్ళు కావాలనుకుంటారంటే – ఈపిల్ల జన్మ పాపపంకిలమైన చరిత్రలపుట్ట."

ఆమె ఆలోచించి "అలాగే" అంది.

"ఇంటికెళ్ళి ఎవరినన్నా పంపిస్తాను" అంటూ రూపాయలకట్ట తీసి ఆమె చేతుల్లోపెట్టి "అంతవరకూ జాగ్రత్తగా చూస్తూ ఉండు." అంటూ బైటికొచ్చాడు. ఆ ముసలమ్మ వెనక్కు పిలిచి "నీ పేరేమిటి నాయనా?" అంది.

"గంగులు" అన్నాడతను.

ఆమె అదోలా చూసింది, "అంటే నువ్వు....?" అర్థాంతరంగా ఆగిపోయింది.

"ఊ.... గజదొంగ గంగుల్ని, పేరు వినే వింటావులే" అన్నాడు.

ఆమె ఎలా ఉన్నది అలా కొయ్యబొమ్మలా అయిపోయింది. గజగజా వణికిపోతూ భయంభయంగా చుట్టూ చూసింది.

జాలిగా నవ్వాడు గంగులు. "నేనూ మనిషినే మామ్మా.నాకూహృదయం ఉంది. అందులోనూ రక్తం, మాంసం ఉన్నాయి. కారణాంతరాలచేత ఉద్రేకంతో వెర్రి ఆవేశం ఆవరించి ఆ విషయం మర్చిపోతుంటాను. అప్పుడు మీరంతా రాతిగుండె మనిషంటారు.నీలాంటి అమాయకులూ, మంచివాళ్ళూ నన్నుచూసి భయపడవలసిన పనిలేదు. ఈ పిల్ల నాహృదయంలో చిన్న దీపాన్ని వెలిగించింది. తుఫానుగాలుల్లో, వర్షపునీటిలో అది ఆరిపోకుంగా చూసుకోవాలి. ఫరవాలేదు. ఈపిల్లను నా ప్రాణంతో సమానంగా చూసుకుంటాను."

ఆముసలమ్మ లేచి నుంచొంది. వీధివరకూ వచ్చి, "జాగ్రత్తగా వెళ్ళు నాయనా. ఒక నెలరోజులపాటు యిక్కడే ఉండనియ్యి. మంచిరోజు చూసుకుని తీసుకువెళ్ళు" అంది.

"అలానే. నువ్వుమాత్రం జాగ్రత్తసుమా. ఈ రహస్యం నీలోనే యిమిడ్చేసుకో" అంటూ వెళ్ళిపోయాడు.

ఎక్కడికి వెళ్ళాడో తెలీదు. నెలరోజులు గడిచాయి. పోలీసులు యింకా అతని

గురించి గాలిస్తూనే ఉన్నారు. ప్రజలుమాత్రం కొంత కాలంపాటు గొప్పగా అతనిగురించి చెప్పుకొని క్రమంగా మర్చిపోయారు. ముసలమ్మ ఆ పసిపిల్ల శరీరంలో రోజురోజుకు అవుపాలతో బలాన్ని నింపుతోంది. ఆ పిల్ల నవ్వులతో, ఏడ్పులతో, ఆటల్తో ఆ పూరిపాక సందడిగా నిండుగా వెలిగిపోతోంది.

ఒకమంచిరోజు గంగులు నమ్మకమైనమనిషిని పంపించి పిల్లను తెచ్చుకున్నాడు. కొన్నివందలమైళ్ళదూరానికి పారిపోయి చిన్న పల్లెటూళ్ళో రెండెకరాల స్థలం కొనుక్కుని, ఆ పొలంలో ఒకమూల కాలవగట్టున చిన్న తాటాకు పాకవేసుకొని అందరితోనూ సంబంధాన్ని తెంచుకొని ఆ కొత్త చోటులో సరికొత్త జీవితం ప్రారంభించాడు.

సొంతంగా సేద్యం చేసి పంటపండించడం, ఒళ్ళొంచి పనిచేయడం నేర్చుకున్నాడు. కష్టపడి గౌరవంగా సంపాదించడంలోని ఆనందం, తృప్తి గుర్తించాడు. నిజాయితీ బ్రతుకులోని స్వచ్ఛమయిన జీవితాన్ని గడుపుతూ హాయిగా కాలం వెళ్ళబుచ్చుతూండేవాడు.

అతనికి సర్వం అ పసిపిల్లే అయ్యింది. ఆ పిల్లకు ముద్దుగా 'రత్నం' అని పేరుపెట్టుకున్నాడు. ఆపిల్ల ఆటపాటల్లో తన మనసును జోడించి పరమానందం పొందేవాడు.

పొలంపనిలేకపోతే ఆరోజల్లా ఆ పిల్లను ఒళ్ళోకూర్చోబెట్టుకుని ఆడించేవాడు. పనిరోజుల్లో ఉయ్యాలలో పిల్లనువేసి ఐదారుసార్లు పనిమధ్యలో వచ్చి చూసి వెళ్ళేవాడు. ఆ పసిపిల్ల అంటే అతనికంత ప్రేమ! ఆ పిల్ల ఏడుస్తే అతని గుండెలమీద ముళ్ళకంచె. ఆ పిల్ల నవ్వితే అతని హృదయంలో పౌర్ణమి చంద్రుని వికాసం. లోకాన్ని మరచి పసివాడై ఆ పిల్లతో ఆడుకొనేవాడు. బయటికి వెళ్ళితే గుర్రబ్బండిలా ఆ పిల్లను వీపుమీద మోసుకొని వెళ్ళేవాడు.

ఆవూరి వాళ్ళంతా అతన్నిచూసి 'ఇదేమిటి!' అనుకున్నారు. వారికెవరికీ అతన్ని గురించి తెలీదు. అతను వాళ్ళందరికీ తనపేరు 'నాగూజీ' అని చెప్పుకున్నాడు. ఆ పేరు వాళ్ళకు నచ్చలేదు. అతను పెంచుకున్న పొడుగాటి గెడ్డం, మెడలో రుద్రాక్షమాల, ముఖంలో శ్రీరంగనినామాలు చూసి 'నాగదాసు' అని పిలిచేవారు. అదీ మారి పొట్టిగా 'దాసు' అయ్యింది.

గంగులు పూర్తిగా మారిపోయాడు. మమత అంటే ఏమిటో అర్థమయ్యింది. జీవితపు విలువలు తెలిసివచ్చాయి. 'జీవితం వెలలేనిది' అనుకున్నాడతడు. అతని

హృదయంలోను, ఆచరణల్లోను విపరీతమయిన మార్పు వచ్చింది. ఆ విధంగా మారిపోయిన తనను తాను చూసుకుని నవ్వుకొంటుంటాడు. అతను తన జీవితంలో కోరేదల్లా ఒక్కటే. పోలీసుల చేతికి చిక్కకుండా జీవించినంత కాలమూ అలాగే ఆపిల్ల ఆటపాటల్ని చూస్తూ ఉండిపోవాలి. 'తను మంచి వాడయ్యాడు. తన ఆత్మను చంపుకొని నిజమయిన మానవుడిగా మారాడు. మళ్ళీ తనకిక వాస్తవమయిన చావు అక్కరలేదు. తనుచేసిన పాపాలకు పశ్చాత్తాప పడడమే ఒక పునర్జన్మ. ఇంకా తనకు చావేమిటి?' అనుకునేవాడు.

చిట్టిరత్నం ఆటల్తో, పాటల్తో, నవ్వులపువ్వుల్తో ఆ యింటిని ముంచెత్తుతోంది. కొత్తకొత్తగా ముద్దొచ్చేటట్టు చిన్న చిన్న మాటల్ని అంటున్నప్పుడు, అడుగుతీసి మరోకొత్త అడుగు వేసి నడుస్తున్నప్పుడు, 'నాన్నా' అని పిలిచి అతన్ని ఏ స్వప్నలోకంలోనికో తీసుకుపోయినప్పుడు అతని ఆనందం రెక్కలు విప్పుకొని విహరించేది.

చిన్నరత్నం పలకాబలపం చేత్తో పట్టుకొని పరికిణీకుచ్చిళ్ళను టపటపలాడిస్తూ పరుగెత్తుకొని బడిలోకి వెళ్ళివస్తున్నప్పుడు, సాయంకాలం పచ్చటి తన పొలంలోకి ఎగిరివచ్చిన బంగారుపక్షిలా రెక్కలు కట్టుకొని వాలుతున్నప్పుడు, కమ్మగా హృదయవీణ తంత్రుల్ని కదిలించి కలస్వనాన్ని పలికించినప్పుడు అతను సర్వాన్నీ మరచి ప్రపంచమంతా 'ఈమె' అనుకొనేవాడు.

రత్నం కాలవగట్టున కూర్చొని రానున్న తన భవిష్యత్ దినాల మధురోహల్లో తేలిపోతున్నప్పుడు, తండ్రి వార్ధక్యపుఛాయల్ని చూసి జాలిగా దగ్గరకు చేరి అరకను తన లేతవేళ్ళ సన్నని చేతుల్లోకి తీసుకొని గిత్తల్ని అదలిస్తున్నప్పుడు, ఇల్లలికి ముగ్గులు పెట్టినప్పుడు, నట్టింట్లో దేవుడి ముందు చిన్న దీపాన్ని వెలిగించి చేతులు జోడించి కళ్ళు మూసినుంచున్నప్పుడు అతని హృదయంలో ఒకవైపు ఆనందం, మరోవైపు విచారం చీకటి వెలుతురుల్లా ఆవరించేవి.

ఆమె జీవితపు తెల్లకాగితం మీద కాలంకుంచె ప్రకృతిపళ్ళెంలో సంఘటనల రంగుల్ని కలిపి అందమయిన చక్కటి రూపాన్ని సృష్టించింది. విశాలమైన పచ్చటి పొలాల్లోని ప్రశాంతత, పరుగెత్తే కాలవనీళ్ళలోని ఆనందపుపొంగు, అంతులేని ఆకాశంలోని నక్షత్రాలకాంతి ఆమెను ఆవరించాయి. రత్నం పూర్ణయౌవ్వనంతో, బిగువైన శరీరపు భాగాలతో, నిండుదనపు అందంతో, అందాలరూపాన్నీ ఆనందాలసువాసనల్నీ వెదజల్లే కుసుమంలా వికసించే ఆకాశంవైపు తలఎత్తి నుంచుంది. పూర్ణ వికాస పుష్పం

విప్పారిన తమ రేఖలభాగాలతో జీవితపు ఆకాశంలో అనుభూతుల సన్నని కాండంమీద నిలబడ్డప్పుడు యౌవ్వన తొలి దినాల ప్రేమల చల్లని వాయువులు వీచి పుష్పాన్ని అటూ యిటూ కదలించివేస్తున్నాయి. అలా వీచిన ప్రేమ వాయువులు 'మధు' హృదయంలోనుండి వీస్తున్నాయి.

మధు సెలవలలో యింటికి వచ్చినప్పుడు కాలవగట్టున ఆమెను చూశాడు. చిన్నప్పటినుండీ ఆమెను చూస్తున్నాడు. కొంతవరకు ఆ పల్లెటూరి బడిలో కలసి చదువుకొని ఆడుకున్నా, ఆమె యౌవ్వనాన్ని తొడుక్కొని వర్షాకాలంలోని కాలవనిండుదనంలాంటి వెల్లిలేని అందంతో కనిపించినప్పుడు చూసి ఆశ్చర్యపోయి 'ఈమె నిజంగా అందాలరాశి. ఆనందాల పొగులకుప్ప! తన జీవితపు పూలతోటలో అందాన్ని చిందించి తుషారబిందువుల చల్లని గాలుల్ని వీచే ప్రేమల ఫౌంటెన్. ఈమె నడక గంగా సరస్వతీనదులతీరు. చూపులు చంద్రవంకలోని శీతలకిరణాలు' అనుకున్నాడు.

రోజూ కాలవగట్టు కొచ్చి కూర్చునేవాడు. చల్లనిప్రేమ చూపుల్ని అటువయిపు ప్రసరించి చూసేవాడు. ఆచూపుల తుమ్మెదలు ఆమె శరీరం మీద వాలి గిలిగింతలు పెట్టి ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసేవి.

సెలవలు అయిపోగానే అతను వెళ్ళిపోయాడు. కాని ఆ రోజున అతను పడ్డబాధ, ఏదో చెప్పాలనుకుని చెప్పలేని అతనిలోని ఆవేదన ఆమె చూసి,'అయ్యోపాపం' అనుకొంది. అతను వెళ్ళిపోగానే ఏమిటో ఆమెకే అదోలా అనిపించింది. రోజూ సాయంకాలం అతనువచ్చి కాలవగట్టున కూర్చున్నప్పుడు చీకటిపడేవరకూ ఒకవిధంగా కాలక్షేపంగా ఉండేది. అతనువెళ్ళిపోగానే కాలవ ఎండిపోయి అడుగున నేల బైటపడ్డట్టు ఆమెదినచర్యలో పెద్దఖాళీ ఏర్పడింది. ఆమెకు అతనిమీద కోపంవచ్చింది. అంతలోకే ఆశ్చర్యం! 'ఏమిటిది! అతనువెళ్ళిపోతే నేనెందుకు బాధపడాలి?' అనుకుంది.

కాని మధు మళ్ళీ సెలవలకు వస్తే,అతన్ని వాలుగాచూసి,అతను ఏదో కల్పించుకొని మాట్లాడితే "ఊ" అని ఆగిపోయి తలవంచుకొని నుంచొంది. అతనూ అటుతర్వాత ఏమీ మాట్లాడలేకపోయాడు. పాపం! తలవంచుకున్న పిల్లను అల్లానే మెడనొప్పి పుట్టేంతవరకూ నిలబెట్టి "వస్తా" అని వెళ్ళిపోయాడు. మర్నాడు ధైర్యాన్ని కూడబెట్టుకొని వచ్చి కబుర్లుచెప్పాడు. 'ఇతను ఎంతమంచివాడు! ఎంతచక్కగా మాట్లాడుతాడు! ఇతని స్నేహం ఎంత చక్కని కాలక్షేపం' అనుకుంది ఆమె.

కూతురికి యిష్టంలేనిపని ఎప్పుడూ గంగులు చెయ్యలేదు. కూతురి ఆనందమే తన ఆనందం. తను ఏపనిచేసినా కూతురు సంతోషంగా నవ్వుతూ ఉండాలనే.

రత్నాన్ని, మధును కాలవగట్టున కూర్చొని మాట్లాడుకోవడం ఒకటిరెండుసార్లు చూసినా అతను ఏమీ అనలేదు. చిరునవ్వు నవ్వుకొనిఊరుకున్నాడు. ఈ విషయం కూతురే ఎప్పుడో తనతో చెప్తుందిలే అని. రత్నం ఎప్పటినుంచో యీ విషయాన్ని తండ్రితో చెప్పాలనుకుని చెప్పలేక తన అసమర్థతకు తన్ను తాను నిందించుకునేది.

ఒకరోజు చెప్పాలనుకునే బలమైన నిర్ణయానికి వచ్చి చెప్పడానికి మాటలురాక గోముగా "నాన్నా" అని ఆగిపోయింది. అంతకన్న యింకేమీ మాట్లాడలేక తలవంచుకొని మౌనంగా గోళ్ళు గిల్లుకొంటూ నుంచుండిపోయింది.

గంగులుకు అర్థమయింది. "ఇలారామ్మా" అని దగ్గరకు పిలిచి మెల్లగా ఆమె శిరోజాల్ని వాత్సల్యంతో దువ్వుతూ"నాకు తెలుసమ్మా, మధుని ప్రేమిస్తున్నావుగదూ, సర్లే" అన్నాడు. ఆమె సిగ్గుతో కుంచుకపోయి పారిపోయి కాలవగట్టున ఆకాశంలోకి నిటార్గా నుంచొని మేఘాల్ని చూస్తూ మనసులో 'మధు.... మధు' అనుకొంది.

ఆమెనుచూసి ఆమె ఆనందపుజల ఎల్లప్పుడూ ఆహృదయపు బావిలో అల్లానే యింకిపోకుండా ఉండాలని అతను కోరుకున్నాడు. కాని ఆమె ఒకనాడు అతనికి తెలీకుండా ఒక్కర్తీ అర్థరాత్రి నిద్రలేచి రహస్యంగా ఏడుస్తున్నప్పుడు అనుకోకుండా ఆమెనుచూసి 'ఏమిటీ యీ తుఫాను! ఏమయిందీ నా చిట్టితల్లికి?' అనుకున్నాడు. ఆ రాత్రి మరి అతనికిక నిద్రపట్టలేదు.

ఉదయం రత్నంలేచి చిరునవ్వులు చిందిస్తూ తిరిగింది. కాని ఆ నవ్వుల్లో సొగసులేదు. అందులో ఆనందం లేదు. స్టూడియో సెట్‌లోని చంద్రుడికి కాంతి ఉంది. తెల్లగా వెన్నెల్ని కురిపిస్తాడు. కాని ఆ వెన్నెల చల్లని కిరణాల్ని ప్రసారం చెయ్యలేదు. సుందరమయిన లోకాల్లోకి తీసుకుపోయి విహరించేలా చెయ్యదు. అంతే! అలా ఆమె నవ్వినప్పుడు అదంతా ఓ కృత్రిమంలా, కల్పించుకొని నవ్విన నవ్వులా ఉంది.

గంగులు జీవంలేని ఆ నవ్వును గుర్తించాడు. ఆమెను పిలిచి "నాకు చెప్పమ్మా, ఎవరన్నా ఏమన్నా అన్నారా? అదోలా ఉన్నావెందుకు" అడిగాడు.

"ఎలా ఉన్నానూ?... బాగానే ఉన్నానే.... ఏం అలా అడిగావ్? " అంది. అదోలా అతనివైపు విచిత్రంగా చూసి తప్పించుకొని వెళ్ళిపోయింది. కాని ఆమెకు దుఃఖం ఆగిందికాదు వంటింట్లో కూర్చొని జలజలా కన్నీరు కార్చేసింది.

గంగులు వెనకాలే వెళ్ళాడు, కూతురిప్రక్కనే కూర్చొని లాలించి "ఎందుకమ్మా నీలోనువ్వే అలా కుళ్ళిపోతావ్? నీ తండ్రితో చెప్పకపోతే యింకెవరితో చెప్పుకుంటావ్? నీకు సర్వాన్నీ నేనేనమ్మా. నాతో చెప్పవూ?" అన్నాడు. ఆ కంఠంలోని జీర అతనిలోని ఆవేదనలకు అద్దం అయింది.

"నాన్నా" అంటూ అతనిభుజంమీదవాలి దుఃఖాన్ని దాచుకోలేక ఏడ్చేసింది. ఆమెకన్నీళ్ళు తుడిచి ఊరుకోబెట్టి కూర్చోబెట్టాడు.

"అసలుసంగతి చెప్పకుండా యిలా ఏడుస్తే ఎలాచెప్పు. నేనుండగా నీమీద యీగకూడా వాలడానికి భయపడుతుందే, ఎవరేమన్నారు?"

ఆమె దుఃఖాన్ని దిగ మ్రింగుకొని, పదాల్ని తడుముకొంటూ "మధుకు పెళ్ళవుతోంది నాన్నా" అంది. "ఏమిటీ!" పులిలా ఘర్జించాడు గంగులు. అతని కళ్ళల్లోనుండి కోపంనిప్పుకణాలు తారాజువ్వలోలా లేచి బైటపడ్డాయి. ఆవేశంతో అతని శరీరం కంపించి పోయింది.

ఆ పాకలో నిట్రాడివాసంపక్క గూడుకట్టుకున్న పిచ్చికలుఆ శబ్దానికిఅదిరి పోయాయి!

"నా చిట్టితల్లిని కాదన్నవాడి వీపు విరగతంతాను. ఎలా కాదంటాడో, అలా అనడానికి ఎన్ని గుండెలున్నాయో యిప్పుడే కనుక్కొస్తాను"

గంగులు పాకవదిలి పెద్ద పెద్ద అంగల్తో బయటికి వెళ్ళిపోయాడు. "నాన్నా..నాన్నా" అంటూ కొయ్యబొమ్మలా నుంచుండిపోయింది రత్నం. ఆమె, తండ్రిలో అంతకోపం ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. అంతకుముందు ఎప్పుడూ ఆమె తన తండ్రి జేవురించిన ముఖంలోని ఎర్రనిచారల్ని చూసి ఉండలేదు. ప్రఫుల్లమైన వదనంలో విశ్రాంతి తీసుకొంటున్న ప్రశాంతత, చల్లని చూపులు, హాయినిగొలిపే చిరునవ్వు-యివే ఆమెకు ఆ తండ్రిలో పరిచితమైనవి.

గంగులు చరాచరా మధును లాక్కొచ్చాడు. బలమైన అతని యినుపసంకెళ్ళు లాంటి చేతుల్లో మధు సన్నని లేత చెయ్యి యిరుక్కుని ఊడిపడడానికి గింజుకుంటోంది. గంగులు ఒక్క కుదుపు కుదిపి చేతుల్ని విదిలించాడు. ఆ కుదుపుకు ఆమె దగ్గరగా నేలమీదకు తూలిపోయి లేచి బట్టల్ని దులుపుకొని అసహాయుడిగా చూశాడు మధు.

"ఏం, నా చిట్టితల్లిని కాదని ఎవర్నో పెళ్ళిచేసుకొంటున్నావట?" ప్రళయంలో ఆకాశంలో విశాలంగా వ్యాపించిన నల్లనిమేఘంలా భయంకరంగా ఉరిమాడు గంగులు.

మధు గజగజ వణికిపోయాడు. అతను నిరుత్తరుడగా తలవంచి "ఊ" అన్నాడు. ఆ స్థితిలో అతన్ని చూచి అయ్యోపాపం!' అనుకుది రత్నం.

"మరి యింత కాలం నాచిట్టితల్లిని యెందుకు మోసంచేశావు మధూ. ఆమెను బెల్లించి కల్లబొల్లి కబుర్లు చెప్పి ఇప్పుడు కాదంటావా? నా తల్లికి ఏమిటి తక్కువని? బంగారపు బొమ్మలాంటిపిల్ల. చిలకలా కమ్మగా కబుర్లు చెబుతుందే. అందర్నీ కూర్చోబెట్టి తనొక్కర్తే యింటిపనంతా చేస్తుందే! అలాంటి పిల్లను కాదని ఎల్లా అన్నావు మధూ? నీకు కావలసింది డబ్బు. డబ్బే కావాలనుకుంటే తెచ్చి నీముందు పోస్తాను. కాని అదంతా పాపపు సొమ్ము. అన్యాయంగా అక్రమంగా సంపాదించిన డబ్బు, అలాంటి డబ్బుతో నీకు తృప్తి, ఆనందం ఉండవు.

ఆ మాటల్లో యిందాకటి ఉధృతంలేదు. జాలి, అభిమానం, వాత్సల్యం ధ్వనించాయి. గంగులు మెల్లగా మధుభుజం పట్టుకుని "చూడు బాబూ! నే పూనుకుంటే లక్షలు గుప్పించి యింతకన్నా మంచి సంబంధం వెతికితేగలను. కాని అది నా చిట్టితల్లికి యిష్టంఉండదు. నాకు కావలసినది నా పంతం నెరవేరడంకాదు, దాని సంతోషం. అది ఏడుస్తే నేను చూడలేను. నిన్ను తలంచుకొని అది నాకు తెలియకుండా రహస్యంగా ఏడుస్తోంది. ఎప్పుడూ ఏడుపనేది ఎరగనిది అలా కుళ్ళి కుళ్ళి ఎందుకేడవాలి" అన్నాడు.

మధు మాట్లాడలేదు. అనేకరకాల ఆలోచనలు అతనిలో తలెత్తి క్రిందపడి తునాతునకలైపోతున్నాయి. ఆ ఆలోచన్ల ఉధృతానికి తట్టుకోలేకపోతున్నాడు అతను.

ఆ విషయం అంత తీవ్రపరిణామాలకు దారితీస్తుందని మధు ఎప్పుడూ అనుకోలేదు. ఆమెను ప్రేమిస్తున్నప్పుడు ముందు ముందు ఆమెను పెళ్ళాడవలసి వస్తుందని, లేకపోతే యింత రాద్ధాంతం జరుగుతుందని ఊహించనేలేదు. కేవలం ఆషామాషీగా ఆమెను ప్రేమించాడు. ఒకక స్త్రీగా ఆమెను కోరుకున్నాడు. కాని యిప్పుడు పిడుగు పడ్డట్టుగా యీ సమస్య నెత్తిమీదికొచ్చిపడింది. వదుల్చుకోవడానికికూడా సాధ్యంకాకుండా ఉంది.

అతనిలోని భావసంచలనాన్ని ఊహించుకొని రత్నం మెల్లగా అతనివద్దకు వచ్చింది. అతని భుజాల్ని రెండుచేతుల్తోనూ పట్టుకొని "ఏమంటావు మధూ? నాకిచ్చిన వాగ్దానాలన్నీ ఉత్తవేనా? ఇన్నిరోజులుగా నువ్వు చూపించిన ప్రేమంతా కృత్రిమమేనా? మధూ! మనిద్దరం కలిసి ఎన్నో ఆలోచించుకున్నాం. అంతస్తుల విభేదాల్ని ధైర్యంగా

ఎదుర్కొందామనుకున్నాం. సమాజానికి జడిసి మన జీవితాలకు సంకెళ్ళు తగిలించుకోకూడదని నిర్ణయించుకున్నాం. అందుకునువ్వు నీ శక్తినంతా ధారపోస్తానన్నావ్. అవసరమయితే ఎదిరించి అవకాశాన్ని ఏర్పరచుకుంటానన్నావ్.. ఇదేనా మధూ ఆనాటి నీ మాటల సారాంశం? నా జీవితంలో విలువైన వాటిని ఎన్నిటినో దోచుకొని యీనాడు నాకు అన్యాయాన్ని చేయాలని చూస్తున్నావా? దురదృష్టం కొద్దీ నేను తల్లినయితే నాగతి యింతేగా. చెప్పు మధూ నిజంగా నేనంటే నీకు ప్రేమలేదూ?" అంది.

"ఉంది రత్నం. కాని ఏంచెయ్యను. స్వతంత్రుడ్ని కాదు నేను. నన్ను నడిపించే పెద్దవాళ్ళు నా వెనక ఉన్నారు. వాళ్ళను ఎల్లా కాదనగలను? కేవలం పెళ్ళిచేసుకుంటేనే నీమీద ప్రేమ ఉందని, లేకపోతే లేదని అనుకుంటున్నావు నువ్వు. సరిగ్గా ఆలోచించిచూడు రత్నం! సమాజానికికూడా కొద్దోగొప్పో భయపడాలిగామరి. వాళ్ళ తృప్తికయినా పెళ్ళి మామూలుగా జరిగిపోనీ. తర్వాత మనం ఏంచేసినా వాళ్ళకు అక్కరలేదు. అప్పుడు నిన్ను జీవితాంతమూ నా దానిగ చేసుకుంటాను. ముందుగా యిప్పుడు అల్లరిచేయడంవల్ల యిద్దరికీ ప్రయోజనంలేదు".

గంగులు వెర్రికోపంతో ఊగిపోయాడు. "ఛీ. ఇదానువ్వు చెప్పొచ్చేది. ఇంత నీచానికా నువ్వు పాల్పడేది. మాకూ అభిమానం, గౌరవం ఉన్నాయి మధూ. మంచిగా చెప్తున్నాఒప్పుకుంటే సరేసరి. లేకపోతే యిదే నీ ఆఖరిక్షణం"

మధు మెల్లగ ధైర్యాన్ని పుంజుకున్నాడు. పౌరుషాన్ని పెంచుకున్నాడు. కాలరు పైకెత్తి "ఏం జేస్తావే?" అన్నాడు.

"ఏంచేస్తానా, చూపిస్తాను ఉండు" అంటూ బలంకొద్దీ ఒక్క లెంపకాయి కొట్టాడు గంగులు. ఆ దెబ్బకు కళ్ళు బయర్లుకమ్మి చూపులు తనచుట్టూ గిరగిరా తిరిగి స్పృహకోల్పోయి కిందపడ్డాడు మధు. "నాన్నా" అంటూ పిచ్చిగా ఒక పొలికేక పెట్టింది రత్నం.

"ఫరవాలేదులేమ్మా. కాస్సేపుంటే అతనే లేస్తాడు" అంటూ పాక బయటికి వచ్చి కూర్చున్నాడు. మొలలోంచి చుట్టతీసి వెలిగించుకుని గట్టిగా దమ్ములాగి వదిలాడు.

మధుని ఆ స్థితిలో చూసి ఆమెకు దుఃఖం పుట్టుకొచ్చింది. నీళ్ళు తెచ్చి ముఖంమీద చిలకరించింది. అతని ప్రక్కనే కళ్ళు తెరచేవరకూ విసురుతూ కూర్చుంది.

మధు మెల్లగా కళ్ళు తెరిచాడు. ఒకమారు చుట్టూ కలయజూసి చటుక్కున లేచినుంచున్నాడు. కొరకొరా చూసి ఆమెను విదిలించుకొని అవతలకు వచ్చాడు.

పాలుతాగి రొమ్ము గుద్దిన పిల్లవాడిలా అతను ఆమెపరిచర్యల్ని తోసిపారేసి వెళ్ళిపోతూంటే ఆమె తలవంచుకొని బరువుగా నిట్టూర్చింది.

మధు బయటికి వచ్చి బాధగా లెంపతడుముకొని కసిగా కాలితో నేలను తన్ని రెండు పెద్ద పెద్ద అంగలువేశాడు యింటికి వెళ్ళిపోదామని. కాని ఎట్టఎదుట గంగులు నల్లని యినుప కడ్డీ నిలబడ్డట్టుగా నిలబడ్డాడు!

తాపీగా చుట్టకాల్చుకొంటూ దగ్గరకువచ్చి "ఏం, ఎటూ తేల్చకుండా వెళ్ళిపోతున్నావ్?" అన్నాడు. మధు మాట్లాడలేదు. అతను చూడనిసమయంలో అతన్ని కొరకొరా చూసి కసితో పెదవి కరుచుకున్నాడు.

సీలు వేసినట్టు అతనిలో కసి అతనిలోనే చిందులు తొక్కింది. అతని అభిమానపు చేతుల్ని కాళ్ళను కట్టిపడేసి లెంపలు వాయిస్తున్నట్టనిపించింది.

"ఏం, ఒప్పుకుంటావా?" గంగులు మళ్ళీ అడిగాడు.

గట్టిగా మాట్లాడితే లాభం లేదనుకున్నాడు మధు. కోపాన్ని అణచుకొని స్వరాన్ని తగ్గించి దీనంగా "నేనింకేంచెయ్యను. నేను చెప్పినట్టు మీరు వినడంలేదు మరి" అన్నాడు.

"ఎందుకునాన్నా ఆయన్ని బాధపెడతావ్. వదిలేయ్" అంది రత్నం.

తండ్రి జాలిగా నవ్వుకున్నాడు. మధుహృదయంలో ఒక మూల మంచితనం సారంగల నేలలో అభిమానం మొలక తలెత్తి అంతలోకే వాడి ఎండి రాలిపోయింది!

"సరేమధూ! అమ్మాయి మాటలకు నేనేమీ అడ్డు చెప్పను. నువ్వు వెళ్ళిపోవచ్చు. కాని నా కూతురికి ఎలాంటి అన్యాయం జరిగినా నేను సహించేది లేదు. ఉండు, ఒక్క అయిదు నిమిషాలు ఆగు. ఇప్పుడేవస్తాను" అంటూ పాకలోకి వెళ్ళాడు. లోపల దేవుడిపటాలకు వేసిన రెండు దండల్ని పట్టుకొచ్చాడు. ఆ రెంటినీ చెరొకరికి యిచ్చి యింట్లో దేవుడిముందు ఎదురెదురుగ నిలబెట్టి ఒకరిమెళ్ళో మరొకరిచేత దండల్ని వేయించాడు. ఇద్దర్నీ దగ్గరగా తీసుకొని తలనిమిరి "ఇది దేవుడి ముందు జరిగిన పెళ్ళి. దీనికి అడ్డేమీలేదు. చల్లగా నూరేళ్ళు బతకండి" అని ఆశీర్వదించాడు.

గంగులు యింతచేస్తున్నా మధు నోరువిప్పి ఒక్కమాటయినా మాట్లాడలేదు. కొయ్యబొమ్మలా అంతాచూస్తూ ఊరుకున్నాడు.

ఆ తర్వాత చరచరా అక్కడనుంచి అరఫర్లాంగుదూరం వెళ్ళి మెడలోని

పొన్నపూలదండను ఒక్కకుదుపుతో తెంపి బలంకొద్దీ దూరంగా కాలవలోకి విసిరి కొట్టాడు.

మళ్ళీ అతను అటురాలేదు. ఆమెను మళ్ళీ చూడాలనైనా అనుకోలేదు.

కాని ఆమెమాత్రం అతన్ని చూసింది. బేండువాయిద్యాలమధ్య బ్రహ్మాండమైన ఊరేగింపులో పూలవిమానంలా అలంకరించిన కారులో రంగురంగుల దీపాల కాంతుల్లో పెళ్ళికూతురి పక్కనే కూర్చొని ఊరేగుతోన్న అతన్ని చూసింది. ఆమెకు కన్నీళ్ళు ఆగినవికావు. ముఖం కప్పుకొని యింట్లోకి వెళ్ళిపోయి మంచంమీదపడి ఆ రోజల్లా లేవకుండా ఏడ్చింది.

గంగులు వచ్చాడు. అతని కళ్ళల్లోనూ ఎర్రని జ్వాలలు అవుపిస్తున్నాయి. ఏనాడో బీజంలో అణగారిపోయిన జీవం తడినేలలో పడగానే మొలకెత్తినట్టు అతనిలోని క్రౌర్యం దాక్షిణ్యపుకవచాన్ని ఛేదించుకొని బైటపడి చిందులుతొక్కుతోంది.

"ఎందుకమ్మా ఏడుస్తావ్? అతని ముద్దుల పెళ్ళాం మెళ్ళోని కొత్తనల్లపూసలదండ నా చేతుల్లో నలిగి ముక్కలయ్యే సమయం వచ్చిందమ్మా. ఇంతకాలమూ అతనికళ్ళముందు దాసు అని పిలవబడేవాడు గజదొంగ గంగులనే విషయం అతనికింకా తెలీదు గాబోలు. ఈ దెబ్బతో ఆ విషయాన్ని ఋజువుచేస్తాను" అన్నాడు. మూలలన్నీ వెతికి ఏనాటిదో పాడుగాటి చాకునుతీసి కాలవగట్టుకు వెళ్ళి సానబట్టుతూ కూర్చున్నాడు.

ఆమె కొయ్యబొమ్మలా చూస్తూ నుంచుండిపోయింది. అంత దుఃఖంలో మునిగిఉన్న ఆమెకూ విచారంపోయి ఆశ్చర్యం వేసింది!

గజదొంగ గంగులుగురించి ఆమె అనేకసార్లువింది. అతని దోపిడీలు, ఖూనీలు, దొంగతనాలు ఎంతో గొప్పగాఅనేకమంది చెప్పుకోగా వింది. ఆమెతండ్రే ఆమెకు అతనిచర్యల్ని కథలుగా ఎన్నోసార్లు చెప్పాడు.

ఈనాడు తొలిసారి తన తండ్రి ఆ గంగులే అని తెలుసుకున్నప్పుడు ఆమెలో ఎందుకో భయం, అసహ్యం, కోపం ఆవరించాయి. ఆమె గజగజా వణికిపోయింది. ఏదో విపరీతం జరగబోతున్నట్టు ఆమె హృదయంలో భయం ఆవరించింది. గబగబా తండ్రిదగ్గరకు వెళ్ళింది.

గంగులు పదునుపెట్టిన చాకును మొలలోదోపుకొని లేచి నుంచున్నాడు

"ఎక్కడికి నాన్నా?" అంది రత్నం.

"ఎక్కడికీలేదు" అంటూ చీకట్లో కలిసిపోయాడు.

"నాన్నా!....నాన్నా!" అంటూ పిలుస్తూ అలానే ఉండిపోయింది ఆమె.

శోకం కళ్ళు తెరచి వెలుతురుగురించి ఎదురుచూసే సమయంలో, గతించిన రాత్రిలో జరిగిన పాపాలరూపాల్ని బైటపెట్టేందుకై తెలతెలవారుతూండగా గంగులు [illegible] ఇంటిని చేరుకున్నాడు. అంతవరకూ అతని గురించి ఎదురుచూస్తూ కిటికీదగ్గరే కాచుకుని కూర్చుంది రత్నం.

అతనివాలకం ఆమె చూసింది. అతనిబట్టలనిండా, చేతులనిండా రక్తపు మరకలు ఆమెకు కనిపించాయి కాని ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది. ఆమెశరీరం ఆమె స్వాధీనంలో లేదు. తల గిర్రున తిరిగిపోతోంది. ఎలాగో ఓపికచేసుకొని మెల్లగా లేచి నుంచోబోయి తూలుతూ కుప్పకూలిపోయింది.

గంగులు ఆతృతగావచ్చి ఆమెను తనవొడిలోకి తీసుకొని "ఏమయిందమ్మా?" అన్నాడు. ఆమె మాట్లాడలేదు. మౌనంగా కళ్ళు మూసుకుంది.

క్షణంసేపు అలాగే మౌనంగా ఉండి ఆతర్వాత మెల్లగా రెప్పల్ని పైకెత్తి అతనికళ్ళల్లోకి దీనంగా చూస్తూ కన్నీళ్ళు కారుస్తూ "చాలా పొరపాటు చేశావునాన్నా" అంది.

గంగులు మెల్లగా ఆమెతలను నిమురుతూ "లేదమ్మా, నేనేమీ పొరపాటుపని చేయలేదు. అలాంటివాళ్ళు ఉండడంవల్ల లోకానికే నష్టం. అతనిగురించి నువ్వేమీ విచారించకు. అంతకు పదింతలు అందగాడిని డబ్బున్న వాడిని తెచ్చి పెళ్ళిచేస్తాను" అన్నాడు.

ఆమె పేలవంగా నవ్వింది. "ఇప్పుడునువ్వు కోటీశ్వరుడ్నీ తెచ్చి పెళ్ళిచెయ్యగలవు కాని మధుని తేగలవానాన్నా? అయినా సమయం దాటిపోయింది. నేను వెళ్ళిపోవలసినక్షణాలు సమీపించాయి. నిన్ను ఒంటరివాడినిచేసి వెళ్ళిపోతున్నానని బాధపడుతున్నాను నాన్నా. కాని వెళ్ళక తప్పదు. ఆశలన్నీ అణగారిపోయాక ఎండుమోడులా ఉండమని నిజంగా నువ్వు సలహా యిస్తావా నాన్నా?...కాని నాన్నా! నువ్వు చాలా పొరపాటు చేశావు. వెర్రిఆవేశంలో నీ కూతురి సౌభాగ్యాన్నే నాశనం చేసావు"

గంగులుకు ఏంజరిగిందీ అర్థంకాలేదు. ఓమారు చుట్టూ చూశాడు. ఒకచోట కొన్ని గన్నేరుకాయలు, చిదగ్గొట్టినపప్పు కనిపించింది. అతనికంతా అర్థమయ్యింది.

"ఏమిటమ్మా యిలా చేశావు" అన్నాడు దుఃఖం ఆపుకోలేక ఏడుస్తూ. ఆమెకూడా ఏడ్చింది.

గంగులులేచి నుంచున్నాడు. ఆమెను ఊరిలోకి తీసుకెళ్ళి చికిత్స చేయిద్దామని ఆమెను లేవనెత్తబోయాడు. అది ఆమె గుర్తించింది. నీరసంగా నవ్వింది.

"లాభంలేదునాన్నా. అంతా అయిపోయింది. నువ్వు వెళ్తున్నప్పుడే ఏంజరగబోయేదీ ఊహించుకున్నాను. నీ పట్టుదల నాకు తెలుసు. అనుకున్న పనిని నెరవేర్చకుండా నువ్వు తిరిగిరావు. అందుకే నా జీవితానికి అంతిమాన్ని సృష్టించుకున్నాను. నా ఊహ పొరపాటుకాదని నా నమ్మకం... నాన్నా.... నా గురించి నువ్వు ఎన్నోకలలు కన్నావు. కాని విధివెక్కిరించింది. నీ కలలన్నీ పగటికలలయిపోయాయి. ఇక అయిపోయింది నాన్నా.... ఇంకొక్కమాట... నీ జీవితానికి కూడా చివరిరోజులు వచ్చినట్లే. యిక్కడ్నుంచి పారిపోనాన్నా. బ్రతికిఉండే యీ కొద్దిరోజులూ...నన్ను.... నన్ను తలంచుకొంటావుకదూ."

ఆమె అయిదు నిమిషాలు ఎగశ్వాసపడ్తూ ఊపిరితీసి మెల్లగా కళ్ళు మూసింది. ఆ మూసిన కళ్ళు మరిక తెరుచుకోలేదు.